అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

● ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మండలంలోని దేవుబుచ్చింపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఆయన కారణంగానే నేడు చాలా మంది అనేక ఉన్నత చదువులు, పదవుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు శ్రద్ధగా చదువుకుని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న అంబేడ్కర్ పోరాట పటిమ, ఉన్నతస్థాయికి ఎదగడానికి చేసిన కృషి తదితర అంశాల గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చింతగడదాస్ మాట్లాడుతూ,అంబేడ్కర్ తన జీవితంలో ఎదుర్కొన్న ప్రతి కష్టాన్ని అభ్యున్నతికి సోపానంగా మల్చుకున్నారని వివరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి మాట్లాడుతూ, అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ఎంతో గొప్పదని చెబుతూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుగుబిల్లి రాములమ్మ, వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, ఎంపీటీసీ క్లోపల్లి త్రినాథ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ప్రిన్సిపాల్ ఆకుల రాజు

పార్వతీపురం టౌన్: ఇంటర్‌మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు మే ఒకటవ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి ఇంటర్మీడియట్ బోర్డ్ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బోర్డు ఆదేశాల మేరకు ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులకు మాత్రమే ఈ సౌకర్యం వర్తిస్తుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్ని సబ్జెక్టులలో రెమిడియల్ తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కల్పించిన ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని మే నెల 24వ తేదీ నుంచి జరగనున్న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలలో పాస్ అయ్యే విధంగా తర్ఫీదు కావడానికి ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని కోరారు.

సప్లిమెంటరీ పరీక్ష ఫీజు 3వ తేదీలోగా చెల్లించాలి

సీతానగరం: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో పాల్గొనదలచిన విద్యార్థులు మే నెల 3లోగా కాలేజీలో ఫీజులు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రేణుక తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు మే నెల 1 నుంచి 20వ తేదీవరకూ సమ్మర్ క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు.

పెద్ద బొండపల్లిలో వియ్‌లవ్ రీడింగ్



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాని గౌరి

పార్వతీపురం టౌన్: మండలంలోని పెద్ద బొండపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని గౌరి ఆధ్వర్యంలో వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు పాఠ్యాంశాలు ఇష్టపడుతూ చదవాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వియ్ లవ్ రీడింగ్‌తో పాటు పాఠ్యాంశాలు చదివి వాటిని ఒక పుస్తకంలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శశిధర్, ఈశ్వరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం



వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం చేస్తున్న అర్చకుడు నవీన్ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని గోవిందమాంబ, కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 330 ఆరాధనా గురుపూజ మహోత్సవం ఆలయ అర్చకుడు నవీన్ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిరంతరం జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా స్వామివారి 330 ఆరాధన మహోత్సవం వందమంది భక్తులతో నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆర్.రామకృష్ణ, ఆచారి డాక్టర్, శంకరరావు, అప్పారావు దంపతులు పాల్గొన్నారు. పూజలనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

రీ సర్వే పూర్తయిన భూముల్లో సర్వేరాళ్ల ఏర్పాటు

● తహసీల్దార్ ఎన్వీ రమణ



రోవర్ సహాయంతో సర్వే రాళ్లు వేస్తున్న సిబ్బంది

సీతానగరం: జగనన్న సమగ్ర భూ రక్ష, హక్కు పథకం అమలులో భాగంగా జిరాయతీ, ప్రభుత్వ భూముల పరిరక్షణకు సర్వే సెటిల్మెంట్ సిబ్బంది, రెవెన్యూ శాఖ సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తిచేయాలని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన చిన్నారాయుడుపేట, కొత్తవలస, బగ్గందొరవలస, బల్ల కృష్ణాపురం గ్రామాల్లో సర్వే రాళ్లు వేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో సర్వే పూర్తయిన భూముల్లో రోజుకు 80 నుంచి 100 సర్వే రాళ్ల వంతున భూముల హద్దులను పరిశీలించి వేయాలని సర్వే సిబ్బందిని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శంకరరావు సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

తాగి పట్టుబడితే జైలుకే..



వాహనదారుడిని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే జైలుకు పంపించడం ఖాయమని సీఐ తిరుమలరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లలో ఎస్‌ఐ సురేంద్రనాయుడుతో కలిసి ఆదివారం వాహన తనిఖీలు చేపట్టి, వాహనదారులు మద్యం తాగారా లేదా అని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించారు. మద్యపానం ఆరోగ్యానికి హానికరమని, మద్యం సేవించి వాహనం నడిపితే సమాజానికి అంతకంటే ప్రమాదకరమన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం ఎంత చెబుతున్నా మందుబాబులు వినడం లేదన్నారు. పెద్దల దగ్గర నుంచి యువత వరకు, చదువుకున్న వారి నుంచి చదువులేని వారి వరకు ప్రతిఒక్కరూ మద్యం సేవించి, వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎంతో మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, మరెంతో మంది దివ్యాంగులుగా మారారని వివరించారు. మద్యం తాగి వాహనాలు నడపకుండా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: సీతంపేట ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ రంగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 8 ఖాళీలు ఉన్నాయి. మొగదారగూడ, ఆడలి అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఈతమానుగూడ, ఓంద్రుజోల, అడ్డాకులగూడ, మండ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు, గురండి, రాజుగాడిగూడలోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్థానికంగా ఉంటున్న మహిళలు ఈనెల 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 15న దరఖాస్తుల పరిశీలన, 18న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి 19న ఐటీడీఏ పీఓ చేతులమీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

జియ్యమ్మవలస/కురుపాం: ఐసీడీఎస్ కురుపాం ప్రాజెక్ట్ పరిధిలోని కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ విజయగౌరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జియ్యమ్మవలస మండలంలోని చంద్రశేఖర రాజపురంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు బీసీ–బి మహిళకు కేటాయించారు. సహాయకుల పోస్టులు.. వనజ (ఓసీ), వెంకటరాజపురం (ఓసీ), బిత్రపాడు (ఓసీ), పెదమేరంగి–2 (ఓసీ–ఈడబ్ల్యూఎస్), వందులవానివలస (ఓసీ) కేటగిరీకి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. కురుపాం మండలంలోని గుజ్జువాయి (ఎస్టీ నోటిఫైడ్), కురుపాం–5 (బీసీ–బి), పాద్దిశ (ఎస్టీ నోటిఫైడ్)లలో ఖాళీలున్నట్లు తెలిపారు. కార్యకర్త పోస్టుకు పదో తరగతి, సహాయక పోస్టులకు 7వ తరగతి పాసై, 21–35 సంవత్సరాల మధ్య వయసు, స్థానికంగా ఉంటున్న మహిళలు అర్హులుగా పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న మహిళలు 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కురుపాం ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి

రేగిడి: విద్యార్థుల్లో చదువుతో పాటు సామాజిక సేవ కూడా ఉండాలని జీఎంఆర్‌ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. మండలంలో మునకలవలస గ్రామంలో గత వారంరోజులుగా నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ సేవాశిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అలాగే విద్యార్థులకు ప్రజా సమస్యలు, సామాజిక సేవ పట్ల అవగాహన వస్తుందన్నారు. అనంతరం గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్‌రావు, అసోసియేట్ డీన్ స్టూడెంట్స్(ఎఫైర్స్) డాక్టర్ జి.శశికుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం అధికారి డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘అందరం పుస్తకాలు చదివేద్దాం’



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు

టెక్కలి: వేసవి సెలవుల్లో విద్యార్థులంతా పుస్తకాలు చదివేలా ప్రభుత్వం అమలు చేస్తున్న అందరం పుస్తకాలు చదివేద్దాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి కోరారు. అందరం పుస్తకాలు చదివేద్దాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెరుమాళి జెడ్పీ ఉన్నత పాఠశాల లైబ్రరీలోని పుస్తకాలను విద్యార్థులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలకు అతుక్కుపోకుండా పుస్తక పఠనంపై దృష్టి సారించాలని సూచించారు. పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం కలుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి తాను తీసుకువెళ్తున్న పుస్తకాలను సకాలంలో చదివి, వాటిని మిగిలిన విద్యార్థులకు అందజేయాలన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు

పాలకొండ రూరల్: స్థానిక ఇందిరానగర్ కాలనీలో కొలువుతీరిన శ్రీమద్‌విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి జీవసమాధి పూజలను భక్తులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ దశమి ఆదివారం నాడు స్వామి ఈ లోకమును వీడి జీవసమాధి అయినట్లు అర్చకులు రాంప్రసాద్ పాడీ తెలిపారు. కాలజ్ఞాన ప్రబోధనలతో లోకానికి మార్గదర్శకంగా నిలచిన వీరబ్రహ్మేంద్రుని విశిష్టతను భక్తులకు వివరించారు.

గిరిశిఖర గ్రామాల్లో తాగునీరు



నడింగూడలో ట్యాంక్ వద్ద నీరు పడుతున్న గిరిజన మహిళలు

భామిని: మండలంలోని తివ్వాకొండపై ఉన్న ఆదివాసీ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ట్యాంకుల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఆదివారం బొడ్డగూడ పంచాయతీ పరిధి కడంబసింగి, బంద్రసింగి, కోసిమానుగూడ, నడింగూడ, గేదెలగూడలకు ట్యాంకల ద్వారా తాగునీరు సరఫరా చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అమరాన సందీప్ తెలిపారు. నీటి సరఫరాను సర్పంచ్ బిడ్డిక మార్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు బిడ్డిక అనంతరావు పర్యవేక్షించారు. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

బలిజిపేటలో సీసీ రోడ్ల నిర్మాణం



బలిజిపేట మెట్ట కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం

బలిజిపేట: బలిజిపేట మెట్ట కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ రాఘలత తెలిపారు. కాలనీలో సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో 112 మీటర్లు, 45 మీటర్ల పొడవు కలిగిన రెండు రోడ్ల నిర్మాణం ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన మరికొన్ని రోడ్ల నిర్మాణాలు త్వరలో చేపడతామన్నారు.

నేడు పట్టుచెన్నేరులో గడపగడపకు మనప్రభుత్వం

సాలూరు: మండలంలో పట్టుచెన్నేరు సచివాలయం పరిధిలో పట్టు చెన్నేరు, పగులు చెన్నేరు గ్రామాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ పార్వతి తెలిపారు. ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర పాల్గొనే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా బాలవికాస కేంద్రం వార్షికోత్సవం



మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ రాధాకృష్ణ

సాలూరు: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలవికాస కేంద్రం వార్షికోత్సవం పట్టణంలో పంచముఖేశ్వస్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సమరసతసేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ రాధాకృష్ణ మాట్లాడుతూ సనాతన ధర్మం గొప్పతనం, హైందవధర్మం ఔన్నత్యం, ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఈ క్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సేవాఫౌండేషన్ సాలూరు సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ దీపం శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గోవిందుని కల్యాణ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పార్వతీపురంటౌన్: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు జగదీశ్వర ఆచారి తెలిపారు. వారం రోజులపాటు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. స్వామి వారి కల్యాణ మహోత్సవానికి పూర్తి ఏర్పాట్లు చేశామని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.


ఆదివాసీ జేఏసీ ఏర్పాటు



జేఏసీ నేతలతో గిరిజన నాయకులు

కురుపాం: ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ కురుపాం మండల కార్యవర్గం ఎన్నిక ఆదివారం కొండలేవిడిలో జరిగింది. కార్యవర్గం ఎన్నికకు ముఖ్య అతిథిగా ఏజేఏసీ గౌరవ చైర్మన్ నిమ్మక జయరాజు హాజరయ్యారు. జేఏసీ కార్యవర్గాన్ని అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గిరిజన సమస్యలపై ఐకమత్యంతో పోరాడి సాధించుకుందామని ప్రతిన భూనారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ ఇంటికుప్పల రామకృష్ణ, బిడ్డిక రామారావు, పల్ల సురేష్, దుక్క సీతారాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హిమరిక నీలకంఠం, వైస్ ఎంపీపీ అన్నాజీరావు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్ దంపతులను సన్మానిస్తున్న గడ్డికాలనీవాసులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషిచేసిన సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావును గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఆరోగ్యవంతమైన పంచాయతీ (థీమ్–2) అవార్డు పొందినందుకు స్థానిక గడ్డికాలనీ వాసులు సర్పంచ్ దంపతులను సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



వెంగాపురం ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

బలిజిపేట: మండలంలోని వెంగాపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శ్రీనివాసరావు ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, హాజరు తదితర అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ, విద్యార్థుల పరీక్షాపత్రాలు, నైపుణ్యాన్ని పరిశీలించారు. పాఠశాల రికార్డుల నిర్వహణపై తగిన సూచనలు అందించారు. విద్యార్థుల ప్రశ్నపత్రాల ఓఎంఆర్ షీట్లను మండల విద్యాశాఖ కార్యాలయానికి అందించారా లేదా అనేది అడిగి తెలుసుకున్నారు. రాబోయే విద్యా సంవత్సరానికి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను విడిచివెళ్లకుండా చూసుకోవాలని సూచించారు. పాఠశాల నిధులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. నిధుల ఖర్చుకు సంబంధించి పక్కాగా లెక్కలు ఉండాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు



తామరఖండిలో జొన్నపంట నూర్పిడి చేయడానికి సిద్ధం చేసిన రైతులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాలో పండించిన మొక్క జొన్నపంట నూర్పిడి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఆర్బీకేల ద్వారా ఏర్పాటు చేయడానికి సిద్ధం చేస్తున్నామని ఏఓ ఎస్ అవినాష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన తామరఖండి, బల్లకృష్ణాపురం గ్రామాల్లోని కళ్లాల్లో జొన్నపంటను యంత్రాల ద్వారా నూర్పిడి చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో కొత్తవలస, తామరఖండి, గెడ్డలుప్పి, బగ్గందొరవలస, చినభోగిలి, అప్పయ్యపేట, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో ఖరీఫ్ వరిపంట తీసిన మాగాణీ భూముల్లో జీరో టిల్లేజ్ విధానం ద్వారా 120 హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కజొన్న పంటసాగు చేశారన్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడం వల్ల దిగుబడి ఆశాజనకంగా ఉన్నందున, క్వింటా జొన్న గింజలు పంట కోతకు వచ్చే వరకూ రూ.2,300 మద్దతు ధర ఉండేదని ప్రస్తుతం రూ.1,750కు మించి కొనుగోలు చేయకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని గుర్తించి మండల కేంద్రంలో జొన్న గింజల కొను గోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జొన్నపంట ఇంటికి చేరుతున్న సమయంలో మద్దతు ధర పడిపోవడంతో ప్రభుత్వమే రైతుల అవసరాలను గుర్తించి కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు సమగ్ర నివేదికను జిల్లా వ్యవసాయాధికారి ద్వారా సమర్పించినట్లు చెప్పారు.

మేడే విజయవంతం చేయండి



మేడేను విజయవంతం చేయాలని ప్రచారం చేస్తున్న నాయకులు

పార్వతీపురంటౌన్: కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఆదివారం కరపత్రాలను విడుదల చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని దేశాల కార్మిక వర్గం 8 గంటల పని దినాన్ని సాధించిందని, ఇతర హక్కులు కూడా సంపాదించుకుందని, నేడు కార్మిక హక్కులను నిలుపుకునేందుకు మరో పోరాటం చేస్తోందన్నారు. మేడే దినోత్సవాన్ని కార్మిక హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాల అమలుకు సంబంధించి తనిఖీలు కనబడకుండా పోయాయని, యజమాన్యాలు ఇష్టారాజ్యం నడుస్తున్నాయన్నారు. ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు తీవ్రంగా అమలవుతున్న నేపథ్యంలో పోరాడి సాధించుకున్న హక్కులపై పాలకవర్గాలు దాడి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులు నాగవంశం శంకర్రావు, నాగవంశం మల్లేశు, నాగవంశం నిర్మల, బంగారి రాజేష్, మామిడి శివ, మామిడి శివప్రసాద్, పడాల గాంధీ, చీపురుపల్లి సింహాచలం, పర్మినెంట్ పారిశుద్ధ్య కార్మికులు నాగవంశం శివ, మజ్జి, కార్మికులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు: ఎమ్మెల్యే



రహదారి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: పాలకొండ–రాజాం రహదారిలో స్థానిక వైఎస్సార్ కూడలి నుంచి సంకిలి వంతెన వరకు నిర్మాణ దశలో ఉన్న రహదారి తాజా స్థితిగతులను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం పరిశీలించారు. పనుల నాణ్యతపై ఆరాతీశారు. రాకపోకలు సాగించేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రూ.3 కోట్లుతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. నాణ్యతలో రాజీపడకుండా పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

సెలవుల్లో ఆన్‌లైన్ బోధన



ప్రోగ్రెస్ కార్డులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సీతంపేట: వేసవి సెలవుల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల సాయంతో ఆన్‌లైన్‌లో బోధించనున్నట్లు స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి తెలిపారు. ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిపి 40 మంది చొప్పున గ్రూప్ క్రియేట్ చేసి దీనిలో వివిధ ప్రాజెక్టులు చేయడం ద్వారా డిజిటల్ ఎడ్యుకేషన్ అందించనున్నామన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్‌ను వారి తల్లి దండ్రులకు వివరించారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. హెచ్‌డబ్ల్యూవో పాలక అమల పాల్గొన్నారు.